క్లుప్తంగా

కొనసాగుతున్న రిలే దీక్షలు



ప్లకార్డులతో దీక్షలో జర్నలిస్టులు

వైరా: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ వైరా పట్టణంలోని జర్నలిస్టులు చేపట్టిన నిరసన దీక్షలు శనివారం మూడో రోజుకు చేరుకున్నాయి. గతంలో దీక్షలు చేపట్టిన సందర్భంగా పలువురు అధికారులు హామీలు ఇచ్చినా నేటికీ అమలు కాలేదన్నారు. ఇటీవల ఖమ్మం సభలో స్వయంగా కేసీఆర్ జర్నలిస్టులకు స్థలాలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ దీక్షలలో ఎక్కిరాల శ్రీనివాసరావు, అక్కిశెట్టి రవితేజ, మేరుగు కృష్ణ, నందిగామ మనోహర్, వినోద్, రాజారావు, నవీన్, విజయ్, రవి , శ్రీకాంత్, రాము, ప్రేమ్‌కుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఎమ్మెల్యే సండ్ర పర్యటన

పెనుబల్లి: మండలంంంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పర్యటించారు. శనివారం పెనుబల్లి గ్రామానికి చెందిన మల్లెల మారేశ్వరరావు, మల్లెల కృష్ణ తల్లి ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాలను పరామర్శించి మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీయంబంజర్‌కు చెందిన వనమా సాంబశివరావు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడంతో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మోహన్‌రావు, సర్పంచ్ తావు, నాయకులు నిరంజన్, కృష్ణ, రాజా, సతీష్ పాల్గొన్నారు.

గంధసిరిలో జెడ్పీ చైర్మన్..

ముదిగొండ: మండలంలోని గంధసిరిలో శనివారం జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజు పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న పలు శుభకార్యాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ప్రముఖ మూలికా వైద్యుడు పస్తం సహదేవరాజు నివాసాన్ని సందర్శించి, మూలికవైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. తన నాడిపట్టి చూసి వైద్యం గురించి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, రైతుబంధు సమితి మండల కన్వీనర్ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు సుభాషిణి, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, ధర్మ, మల్లయ్య, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసేది నేనే..



విలేకరులతో మాట్లాడుతున్న రామ్మూర్తి

మధిర: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మధిర బీఆర్ఎస్ అభ్యర్థిగా తానే పోటీ చేస్తానని పార్టీ నాయకుడు బొమ్మెర రామ్మూర్తి తెలిపారు. మధిరలో శనివారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ పెద్దల మద్దతు తనకే ఉన్నందున తప్పక టికెట్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈమేరకు మధిరలో గులాబీ జెండా ఎగరవేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సిద్దినేనిగూడెం సొసైటీ ఉపాధ్యక్షుడు తాటి సురేష్, తెలంగాణ జాగృతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొబ్బిళ్లపాటి బాబురావు పాల్గొన్నారు.

గోవింద్‌తండాలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

కారేపల్లి: విశాఖ స్టీల్ ప్లాంట్ అనుబంధ మాధారం డోలమైట్ మైన్స్ ప్రభావిత ప్రాంత సామాజిక బాధ్యతలో భాగంగా.. సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలను మాధారం మైన్స్ జీఎం శివకుమార్, స్థానిక సర్పంచ్ అజ్మీర నరేష్‌లు శనివారం ప్రారంభించారు. మాధారం గ్రామ పంచాయతీ పరిధిలోని మాధారం గ్రామంలో రూ.10లక్షల సీఎస్ఆర్ నిధులతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణం, గోవింద్‌తండా గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు పనులను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మైన్స్ పర్సనల్ మేనేజర్ చిట్టి రాజు, నారాయణ, కార్మిక సంఘాల నాయకులు నరసింహారావు, వీరూ నాయక్, లాలు, శ్యామ్‌లాల్, రవి, నర్సింగ్ పాల్గొన్నారు.

కప్పల బంధంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

కల్లూరు రూరల్: మండలంలోని కప్పలబంధం గ్రామ పంచాయతీలో సర్పంచ్ నందిగాం ప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కృషితో 20లక్షలతో నిర్మిచనున్న 420 మీటర్ల సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మాధవరెడ్డి, పీఆర్ఏఈ వెంకటేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ, సాంబశివారెడ్డి, వర్డు మెంబర్ నరేందర్‌రెడ్డి, వెంకటేశ్వరెడ్డి, బుడ్డయ్య, కోటయ్య, రామిరెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పాతికేళ్ల ఉత్సవాలకు వేళాయె..

- ముస్తాబైన తల్లాడ లూర్దుమాత చర్చి
- విచారణ మొదలై 70ఏళ్లు, చర్చికి 25 సంవత్సరాలు
- పది రోజుల పాటు పండుగ, ప్రత్యేక ప్రార్థనలు

సండే స్పెషల్

తల్లాడ: తల్లాడలో విచారణ స్థాపించి 70 ఏళ్లు.. చర్చి నిర్మించి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా లూర్దు మాతా ఆలయంలో సిల్వర్ జూబ్లీ ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. 1997 ఫిబ్రవరి 16న తల్లాడలోని రాష్ట్రీయ రహదారి పక్కన ఖమ్మం మేత్రాసనం ఆధ్వర్యంలో నిర్మించిన చర్చిని ప్రారంభించారు. జిల్లాలోనే అతి పెద్ద చర్చిల్లో ఒకటైన ఇక్కడ శనివారం మొదలైన ఉత్సవాలు పది రోజుల పాటు 20వ తేదీ వరకు జరగనున్నాయి.

ఆలయ విశిష్టత..

తల్లాడలో రాష్ట్రీయ రహదారి పక్కన లూర్దుమాత చర్చి నిర్మించారు. అద్భుత ఆలయంగానే ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన ఎత్తయిన చర్చి లోపల బాల ఏసు, మరియ లూర్దుమాతా విగ్రహాలు కనిపిస్తాయి. పాతికేళ్ల క్రితం రోమన్ కేథలిక్ మిషన్ ఆధ్వర్యాన నిర్మించిన చర్చి ఇప్పటికీ చెక్కు చెదరకుండా భక్తుల మన్ననలు అందుకుంటోంది. ఆలయంలో కల్వరి కొండలు, ఏసుక్రీస్తు జీవిత విశేషాలు, లూర్దుమాతా చిత్రపటాలు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. 150అడుగులు ఎత్తు ఉండే చర్చి గోపురం దూరం నుంచే ఆకట్టుకుంటుండగా... చర్చి ఆవరణలో ఒకేసారి 3వేల మంది ప్రార్థనలు చేసే వీలుంది.



సిల్వర్ జూబ్లీ ఉత్సవాలకు ముస్తాబైన తల్లాడ లూర్దుమాత ఆలయం

ఇక ఆలయంపై ఉన్న గంట ప్రతిరోజు తెల్ల వారుజామున మోగించినప్పుడు కిలోమీటర్ దూరం వరకు వినిపిస్తుంది. ఈ చర్చికి అనుసంధానంగా గోపాలపేట, మిట్టపల్లి, కుర్నవల్లి, రెడ్డిగూడెం



చర్చి ఆవరణలో కల్వరి కొండలు, యేసుక్రీస్తు స్వరూపాలు

తదితర గ్రామాల్లో ప్రతీ ఆదివారం ప్రార్థనలు నిర్వహిస్తారు. అలాగే, చర్చి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నాయి.

పది రోజుల పాటు మహోత్సవాలు..

లూర్దుమాత చర్చి సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు శనివారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 20వ తేదీ వరకు తిరునాళ్లు, రజతోత్సవ మహోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ప్రతిరోజు ప్రార్థనలు, చివరిరోజైన 20వ తేదీన ఖమ్మం మేత్రాసనం పీఠాధిపతి ఉడుమల బాల ఆధ్వర్యాన లూర్దుమాతా దివ్య స్వరూపంతో ఊరేగింపు నిర్వహించనున్నట్లు కమిటీ బాధ్యులు తెలిపారు.

ఎంతో ప్రాశస్త్యం..



లూర్దుమాత ఆలయాన్ని ఖమ్మం పీఠం ఆధ్వర్యాన నిర్మించగా ఎంతో ప్రాశస్త్యం పొందింది. జిల్లాలో పెద్ద చర్చిగా దీనిని చెప్పుకోవచ్చు. వేలాదిగా భక్తులు ప్రార్థనలకు వస్తుంటారు. ఈమేరకు సిల్వర్ జూబ్లీ ఉత్సవాల నిర్వహణకు కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

– టి.సురేష్, ఆలయం విచారణ గురువు

దాతల సహకారంతో వేడుకలు..



ఈ దఫా సిల్వర్ జూబ్లీ వేడుకలు దాతల సహకారంతో జరుగుతున్నాయి. సంఘంలో ఉన్న వారితో పాటు అన్ని వర్గాల వారిని భాగస్వాములను చేస్తున్నాం. ఇప్పటికే ఆలయానికి రంగులు వేయడం పూర్తయింది. అలాగే, లైట్లు ఏర్పాటుచేసి భక్తుల ప్రార్థనలకు సిద్ధం చేస్తున్నాం.

– మూకర ప్రసాద్, నారాయణపురం

పది రోజుల పాటు పండుగే..



లూర్దుమాతా ఆలయంలో పది రోజుల పాటు పండుగ జరుగుతుంది. ఈనెల 20వరకు ఇక్కడ ప్రతిరోజు ఉత్సవాలలో భాగంగా ప్రార్థనలు, దివ్య బలిపూజ ఉంటుంది. వివిధ ప్రాంతాల నుంచి ఫాదర్లు, మతపెద్దలు వచ్చి సందేశం ఇస్తారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశాం.

– మూకర చార్లెస్, నారాయణపురం

పొంగులేటితోనే మా ప్రయాణం



శ్రీనివాసరెడ్డితో మాటూరు వాసులు

మధిర: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితోనే తమ ప్రయాణం ఉంటుందని మాటూరు ఉపసర్పంచ్ కాశీ కోటేశ్వరరావు తెలిపారు. డాక్టర్ కోట రాంబాబు సమక్షాన శనివారం ఖమ్మంలో కోటేశ్వరరావుతో పాటు పలువురు పొంగులేటిని కలిసి మాట్లాడారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో శ్రీనివాసరెడ్డి మద్దతు తెలిపే అభ్యర్థిని గెలిపించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యన్నం కోటేశ్వరరావు, కపిలవాయి సత్యనారాయణ రాజు, బూసా సాంబయ్య, కుసుమ గోవిందం, పల్లిపాటి రమేష్, ఇస్రాయేలు, గజ్జెల వీరయ్య వారం వెంకటేశ్వర్లు, అబ్బాస్, మేడిశెట్టి నల్లయ్య ఉన్నారు.

ఏఐపీకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడిగా వెంకటేష్



కె.వెంకటేష్

సత్తుపల్లిటౌన్: అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం కల్లూరు డివిజన్ నూతన కార్యవర్గాన్ని శనివారం సత్తుపల్లిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.వెంకటేష్, కార్యదర్శిగా బి.లాజర్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధిహామీ చట్టం సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

లోక్ అదాలత్‌తోనే సత్వర న్యాయం



సత్తుపల్లిటౌన్: మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి డాక్టర్ శివరామప్రసాద్



మధిర: మాట్లాడుతున్న న్యాయమూర్తి ధీరజ్ కుమార్

మధిర/సత్తుపల్లిటౌన్: కక్షిదారులకు ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం లభిస్తుందని, మధిర కోర్టు న్యాయమూర్తి డి.ధీరజ్‌కుమార్, సత్తుపల్లి అదనపు జిల్లా జడ్జి డాక్టర్ పి.శివరామప్రసాద్ లు అన్నారు. శనివారం మధిర కోర్టు పరిధిలోని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జ్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో 1,115 కేసులు పరిష్కారం కాగా 1,255,400 జరిమానా విధించడం జరిగింది. అంతే కాకుండా బ్యాంక్ అదాలత్ ద్వారా 37 కేసులు పరిష్కారం అయ్యాయి. 9 సివిల్ కేసులు కూడా పరిష్కారం అయ్యాయి. సత్తుపల్లి కోర్టు పరిధిలో 694 కేసులను పరిష్కరించారు. మోటారు వాహనాల కేసుల్లో బాధితులకు రూ.29.34 లక్షల పరిహారం ఇప్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాజీపడి లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకుంటే విలువైన సమయంతో పాటు ఖర్చు ఆదా అవుతుందన్నారు. రాజీయే రాజమార్గమన్నారు. లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పు సుప్రీం కోర్టు తీర్పుతో సమానమని స్పష్టం చేశారు. లోక్ దాలత్‌లో మరిన్ని కేసులు పరిష్కారం చేసినందుకు న్యాయవాదులకు, పోలీస్ వారికి, సహకరించిన అందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.వుల్లారావు, సీనియర్ న్యాయవాదులు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, చింతల గోపాల్, దేవరపల్లి సుబ్రహ్మణ్యం, చావలి రామరాజు, సతీష్, గంధం శ్రీనివాస్‌తో పాటు మధిర సీఐ ఒడ్డేపల్లి మురళి, ఏపీపీలు నాగలక్ష్మి, భద్రయ్య, సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి, జూనియర్ సివిల్ జడ్జి శ్రావణస్వాతి, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ జె.గోపాలరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వి.రాజేంద్రప్రసాద్, ఏపీపీ అబ్దుల్ బాషా, న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పని దినాలు పెంచాలని ధర్నా



మాధారం డోలమైట్ మైన్స్ ముందు ధర్నా చేస్తున్న రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు

కారేపల్లి: విశాఖ స్టీల్ ప్లాంట్ అనుబంధ మాధారం డోలమైట్ మైన్స్ ముందు రైల్వే కాంట్రాక్టు కార్మికులు సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ నాయకులు జి.నరసింహారావు, బి.వీరన్నలు మాట్లాడారు. రైల్వే కాంట్రాక్టు కార్మికులకు 26 రోజుల పనిదినాలను పెంచాలని డిమాండ్ చేశారు. వీఎస్‌పీ యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. పనిదినాలు పెంచకపోతే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు వెంకన్న, వీరూ, ఖైరుద్దీన్, ఇబ్రహీం, రవికుమార్, హుస్సేన్, లక్ష్మీనారాయణ, కళావతి, వీరన్న, ఇబ్రహీం, ప్రసాద్, మీరా, కృష్ణ, వీరు, హరి తదితరులు పాల్గొన్నారు.

నారాయణపురంలో కంటి వెలుగు ప్రారంభం

బోనకల్: మండలంలోని నారాయణపురం గ్రామంలో శనివారం కంటివెలుగు కార్యక్రమాన్ని ఎంపీడీఓ వేణుమాధవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరు కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి బాలకృష్ణ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



ఎంపీడీఓకు కంటి పరీక్ష నిర్వహిస్తున్న వైద్యుడు

మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలను ప్రదర్శిస్తున్న గిరిజన సంఘం నాయకులు

కొణిజర్ల: తెలంగాణ గిరిజన సంఘం ఖమ్మం జిల్లా 3వ మహాసభలు కారేపల్లి మండల కేంద్రంలో ఈ నెల 25న జరుగుతాయని, ఈ మహాసభల విజయవంతానికి మేధావులు, ప్రజా ప్రతినిధులు, గిరిజనులు కృషి చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం పిలుపునిచ్చారు. శనివారం కొణిజర్ల మండలంలోని పలు తండాలలో సభల జయప్రదం కోరుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కృష్ణకాంత్, హరిచంద్, నంద్యా నాయక్, నరసింహారావు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

12న నిర్వహించే పాదయాత్రను..

పోడు సర్వే చేపట్టాలని ఈ నెల 12న ఎల్ల న్న నగర్ నుంచి సమీకృత కలెక్టరేట్ వరకు నిర్వహించే పాదయాత్రను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ఎల్లన్న నగర్‌లో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లన్న నగర్ పోడు భూముల సర్వే చేయక పోవడం విచారకరమన్నారు. ఈ పాదయాత్ర నేడు ఉదయం 7 గంటలకు ప్రారంభించి సోమవారం ఉదయానికి సమీకృత కలెక్టరేట్‌కు చేరుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ వైరా కల్లూరు సబ్ డివిజన్ కార్యదర్శి అర్జునరావు, మండల కార్యదర్శి అప్పారావు, సోములు, శ్రీను, కోటబాబు, సునీత, లాల్‌సింగ్, సిన్నయ్యా తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన లారీ

వైరారూరల్: మండలంలోని సోమవరం గ్రామం వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొట్టిన ఘటనలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలైయ్యాయి. బోనకల్ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన దాసరి మల్లయ్య తమ బంధువుల పెళ్లికార్డులను పంచేందుకు ద్విచక్ర వాహనంపై సోమవరంలో బంధువుల ఇంటికి వెళ్లి వస్తున్న క్రమంలో లారీ ఢీ కొట్టింది. ఈ క్రమంలో అతని చేయి విరిగి ఎముక బయటకు వచ్చింది. దీంతో మల్లయ్యను వెంటనే ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి విచారణ నిర్వహించారు.


కేసు నమోదు

కారేపల్లి: మండలంలోని మంగళితండా గ్రామానికి చెందిన ధరావత్ రామకృష్ణ శుక్రవారం రాత్రి అదే గ్రామంలో ఉన్న చెరువు వద్దకు కాపలాకు వెళ్లాడు. కాగా.. అదే గ్రామానికి చెందిన ధరావత్ పంతులు చేపలు దొంగిలించేందుకు వెళ్లాడని, పసిగట్టిన రామకృష్ణ.. చేపల దొంగతనానికి ఎందుకు వచ్చావని ప్రశ్నించాడు. దీంతో నన్ను దొంగా అంటావా అని పంతులు రాయితో రామకృష్ణపై దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో రామకృష్ణ తలకు తీవ్రగాయమైంది. విషయం తెలుసుకున్న రామకృష్ణ తండ్రి వెంకటేశ్వర్లు, సోదరుడు రాంబాబు మా వాడిపై దాడి చేస్తావా అంటూ పంతులుపై ప్రతిదాడికి దిగి గాయపర్చారు. శనివారం ఇరువురు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పంతులు, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, రాంబాబులపై కారేపల్లి ఎస్సై రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు..

నేలకొండపల్లి: అదనపు కట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై వివాహిత ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని తిరుమలాపురానికి చెందిన మాలోత్ జ్యోతికి కొణిజర్ల మండలం అంజనాపురానికి చెందిన నరసింహాతో వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు జన్మించాక, అదనపు కట్నం కోసం భర్త, అత్తామామలు వేధిస్తున్నారని చేసిన ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసినట్లు నేలకొండపల్లి ఎస్సై జి.స్రవంతి తెలిపారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల కేటాయింపులో వివక్ష



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

ఖమ్మంమయూరిసెంటర్: చింతకాని మండలంలో సీపీఐ గెలుచుకున్న గ్రామపంచాయతీలపై అధికారులు వివక్ష చూపిస్తున్నారని రాఘవాపురం సర్పంచ్ కొండపర్తి గోవిందరావు ఆరోపించారు. ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లకు నిధులు కేటాయించాల్సి ఉండగా అధికారులు మూడేళ్లుగా రాఘవాపురం, కోమట్లగూడెం గ్రామాలకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు. ఇక ఈజీఎస్ పనిదినాలకు ఖర్చు చేసిన మొత్తంలో 40 శాతం సిమెంట్, ఇతర పనులకు కేటాయించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. ఫలితంగా గ్రామపంచాయతీలు, ప్రజలు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు పావులూరి మల్లికార్జున్, రాసాల మోహన్‌రావు, నక్కనబోయిన కృష్ణ, వేమిరెడ్డి సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామ శాఖలతో సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు ఉమాశంకర్

కారేపల్లి: కారేపల్లి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్ ఆధ్వర్యంలో గ్రామ శాఖ అధ్యక్షులతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమాశంకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎవరెన్ని ప్రలోభాలు పలికిన బీఆర్ఎస్ కార్యకర్తలు కేసీఆర్ నాయకత్వంలో నడుస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ సత్యానారాయణ, మాజీ మండల అధ్యక్షుడు తోటకూరి పిచ్చయ్య, అడ్డగోడ ఐలయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, పుల్లారావు, ఎంపీటీసీ సంఘం అధ్యక్షులు పాండ్యానాయక్, సర్పంచ్ కుమార్, సొసైటీ డైరెక్టర్ ఉపేందర్, రోషయ్య, ధోనినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ నేషనల్ ప్యాట్రన్‌గా జయదీప్ ముఖర్జీ



జయదీప్ ముఖర్జీ నంబూరిని సత్కరిస్తున్న ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్

సత్తుపల్లిరూరల్: నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ జాతీయ ప్యాట్రన్‌గా సత్తుపల్లి మండలం రేజర్లకు చెందిన న్యూసాంగ్ స్కూల్ ప్రిన్సిపాల్ జయదీప్ ముఖర్జీ నంబూరిని నియమిస్తూ ఎన్‌సీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యాప్‌పాల్ ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక ఎన్ఆర్‌నగర్ క్రీస్తు సంఘం ప్రార్థనా మందిరంలో శనివారం జరిగిన సమావేశంలో ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్ ఉత్వర్వ్యును జయదీప్ ముఖర్జీకి అందంచి సత్కరించారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ ప్రసాద్, వసంతకుమార్, రత్నాకర్, రాజు, ప్రకాశరావు, మ్యాథ్యూస్, నవకుమార్, నాగేశ్వరరావు, జయరాజు, జార్జీ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

తల్లాడ: ఇల్లెందు నియోజకవర్గంలో పర్యటించిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని శని వారం తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు కలిశారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలో పార్టీ బలోపేతానికి నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తల్లాడ పట్టణ అధ్యక్షుడు దగ్గుల నాగిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుదాకర్, రఘుపతిరెడ్డి, కిరణ్, నరసింహారావు, వెంకటరెడ్డి, అంజయ్య, శ్రీను, జమాల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కల్లూరు ఏసీపీగా రామానుజం బాధ్యతల స్వీకరణ



బి.రామానుజం ఏసీపీ

సత్తుపల్లి: సత్తుపల్లి ఏసీపీ కార్యాలయంలో కల్లూరు ఏసీపీగా బి.రామానుజం శనివారం బాధ్యతలుగా తీసుకున్నారు. జగిత్యాల డీఎస్పీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఏసీపీగా పని చేసిన ఎన్.వెంకటేష్ పాల్వంచకు బదిలీ అయిన విషయం విధితమే.

దీన్ దయాళ్ వర్ధంతి

మధిర/ఏన్కూరు: మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో పండిట్ దీన్‌దయాల్ వర్ధంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మధిర బీజేపీ కార్యాలయంలో, ఏన్కూరు ప్రధాన సెంటర్‌లో దీన్‌దయాల్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి విజయరాజు, జిల్లా కార్యదర్శి సాంబశివరావు, పట్టణ అధ్యక్షుడు రమేష్, డీఎస్ఎన్ సోమేశ్వరరావు, ప్రకాష్, మోహన్ రావు, రామకృష్ణ, రాము, జానీ, బీజేపీ మండలాధ్యక్షుడు రమేష్, కొవ్వూరి నాగేశ్వరావు, రెంటపల్లి నారాయణ, మోరబోయిన కృష్ణ, నవీన్, సిహెచ్ సత్యనారాయణ, వజినేపల్లి దర్గయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ముదిగొండ: మండలంలోని సువర్ణాపురంలో శనివారం రాత్రి లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్యస్వాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి సేవకురాలు కనపర్తి అనంతమ్మ ఆధ్వర్యంలో పెనుగంచిప్రోలు దేవస్థానం ప్రధాన అర్చకుడు రమణస్వామి సారథ్యంలో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పీటలపై కూర్చొని అమ్మవారికి పూజలు చేసి, కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దుర్గ, రైతుసమితి మండల కన్వీనర్ ప్రసాద్, మోహన్‌రావు, వెంకట్, రామకృష్ణ లు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో 'సాయిస్ఫూర్తి' విద్యార్థుల ప్రతిభ



జట్టును అభినందిస్తున్న సాయిస్ఫూర్తి కళాశాల యాజమాన్యం

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం సాయి స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల పాలిటెక్నికల్ విభాగం విద్యార్థులు ఈ నెల 9, 10వ తేదీల్లో అనురాగ్ పాలిటెక్నికల్ కళాశాల క్రీడా మైదానం కోదాడ, నల్గొండలలో వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ వాలీబాల్ క్రీడల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి 9 జిల్లాలు పాల్గొన్నాయి. వాలీబాల్ ఫైనల్ అనురాగ్ పాలిటెక్నికల్ కళాశాలపై సాయిస్ఫూర్తి పాలిటెక్నికల్ కళాశాల విద్యార్థులు విజయం సాధించి విజేతగా నిలిచినట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రఘుపతిరెడ్డి తెలిపారు. విజేతలను శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శేషారత్నం, కళాశాల సెక్రటరీఅండ్ కరస్పాండెంట్ ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్ విజయ్‌కుమార్, డిప్లొమా డీన్ రాంబాబు, హెచ్ఓడీలు, విద్యార్థులు అభినందించారు.